బురదమయంగా రోడ్డు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని చినలబుడు పంచాయతీ హట్టగుడ గ్రామ సమీపంలో ఉన్న హట్టగూడ వంతెన వద్ద ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి పేరుకు పోయి బురుదమయంగా మరింది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు, వంతెన కొత్తగా నిర్మించారు. కనీసం రక్షణ గోడ కుడా నిర్మంచలేదని, దీంతో మరితంగా ప్రమాధకరంగా ఉందని స్ధానికులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి వంతెన పై ఉన్న బురదను తొలగించి వాహనాలు రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

బురదగా ఉన్న రోడ్డు

అకాల వర్షాలతో కాఫీ పంటకు నష్టం

- రైతులకు ఆదుకోవాలి - జాతీయ కాఫీ రైతు సంఘం నాయకులు చిన్నబాబు

కాఫీ పండ్లను పరిశీలిస్తున్న చిన్నబాబు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు కాఫీ పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని జాతీయ కాఫీ రైతు సంఘం నాయకులు గెమ్మెల చిన్నబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అరకులోయ మండలం సుంకరమెట్టలో పర్యటించి రైతులు పండించిన కాఫీ పంట ను పరిశీలించారు. రైతులను కాఫీ పంట నష్టంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ కాఫీ రైతు సంఘం నాయకులు గెమ్మెల చిన్నబాబు మాట్లాడుతూ, అల్లూరి జిల్లా ఏజెన్సీలో పండించే ఆర్గానిక్ కాఫీకు అంతర్జాతీయ మార్కెట్ లో మంచి గిరాకీ ఉందన్నారు. ఆ రేటు కష్టపడి మొక్కలు నాటి పంట పండించే రైతులకు అందటం లేదని అన్నారు. ఇటీవల జీసీసీ ప్రకటించిన కిలో పార్చిమెంట్ కాఫీ రూ.320 రైతులకు ఏ మాత్రం సరిపోదని, కిలో కాఫీ 500 రూపాయలకు కొనుగోలు చేయడానికి జీసీసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పళ్ళు కిల్లో రూ.100 ,చెర్రీ 280 రూపాయలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. కాఫీ రైతులకు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరగడంతో జీసీసీ ప్రకటించిన ప్రస్తుత రేట్లు రైతులు పెట్టుబడి పెట్టిన ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. ఒక వైపు ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో గంజాయి నిర్మూలన కోసం ప్రత్యామ్నాయ పంటలు పండించాలని అంటూనే కాఫీ పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించక పోతే ఏ విదంగా సాగు చేస్తారని ప్రశ్నించారు.అంతర్జాతీయ మార్కెట్‌లో అరకు కాఫీకు మంచి గిరాకీ ఉందని, ప్రభుత్వ సంస్థలైన జీసీసీ అతి తక్కువ రేట్లు ప్రకటించడంతో రైతుల నుండి అతి తక్కువ రేట్లకు దళారులు, ప్రైవేట్ సంస్థలు కొనుగోలు చేస్తు రైతులకు తీవ్రంగా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాఫీ పళ్ళు కోత సమయంలో జిల్లాలో కురుస్తున్న అకాల వర్షలకు ఈ సంవత్సరం కాఫీ పంట మొత్తం నేల నేల పాలవడంతో రైతులకు తీవ్ర నష్ట వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం కాఫీ రైతులకు ఎకరాకు లక్ష రూపాయలు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ రైతులు కొర్ర చిట్టిబాబు, గెమ్మెల లక్ష్మణ్, కొర్ర సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

గ్రామ సభలకు ప్రత్యేక అధికారాలు

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు : పిసా చట్టం అమలు ద్వారా గ్రామసభలకు ప్రత్యేక అధికారాలు సంక్రమిస్తాయని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వెల్లడించారు. జాతీయ పీసా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పీసా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాడేరు గ్రామా పంచాయతీలో మోదకొండమ్మ ఆలయం ఆడిటోరియంలో సర్పంచ్ కె.ఉషారాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమమునకు ముఖ్య అతిదిగా జిల్లా కలక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం పీసా వర్తించే గ్రామాలకు కమిటీలను తయారు చేసి వచ్చే నెల జనవరి 3 నుండి 7 వరకు గ్రామ సభలు ద్వారా పీసా ఎన్నికలు జరిపి వైస్ ప్రెసిడెంట్, సెక్రెటరీ ఎన్నికలు చేపడతామని తెలిపారు. పీసా యాక్ట్ ద్వారా ప్రత్యేకంగా ఆదివాసి గ్రామాలకు గ్రామ సభల ద్వారా లభించే, అధికారాలను స్థానిక గిరిజనులు వారి గ్రామాభివృద్ధికి సవ్యంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితి అధికారి బి.లోవరాజు, మండల అబివృద్ధి అధికారి ఎస్.డేవిడ్ రాజు, ఇఒఆర్ డి ఆర్.వి.ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో లబ్బూరు జంక్షన్‌లో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్థానిక ఎస్సై రామకృష్ణ వాహనాలు తనిఖీలు చేస్తూ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాలు ఒడిస్సా నుండి ఆంధ్ర వైపు అక్రమంగా తరలిస్తున్న ఒడిస్సా మద్యాన్ని ఎస్సై సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఒడిస్సాకు చెందిన వ్యక్తి మారుతి కారులో అక్రమంగా తరలిస్తుస్తూ పట్టుబడ్డాడన్నారు. మద్యం విలువ సుమారు రూ.14,000 ఉంటుందన్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై తెలిపారు.

4 రోజులు స్తంభించనున్న ఎపిజివిబి సేవలు

ప్రజాశక్తి-పాడేరు :- భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఆదేశాల మేరకు వరంగల్ ప్రధాన కార్యాలయం కేంద్రంగా ఏపీజీవీబీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విభజించడం జరుగుతుందని బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్‌చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకూ బ్యాంక్ సేవలు, ఏటీఎం కార్డులు, ఆన్లైన్ నగదు లావాదేవీలతో పాటు ఇతర బ్యాంకు కార్య కలాపాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 1వ తేదీ నుంచి బ్యాంక్ సేవలు వినియోగ దారులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

వంతెన పునర్నిర్మాణం చేయాలని నిరసన

ప్రజాశక్తి-సీలేరు

సెప్టెంబర్‌లో వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన చిన్నగంగవరం వంతెన పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ ఆ గ్రామస్తులు మంగళవారం వంతెన వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ చిన్న గంగవరం వంతెన సెప్టెంబర్ 8న అర్ధరాత్రి వచ్చిన వరద బీభత్సానికి పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరయం ఏర్పడుతుంది. చిన్న గంగవరం గ్రామాన్ని ఆనుకొని ఆరు గ్రామాలు, వెయ్యి మందికి పైగా జనాభా ఉన్నట్లు చెప్పారు. వీరు దారకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నా, నిత్యవసర సరుకులు తెచ్చుకోవాలన్నా వంతెన పైనుంచి రాకపోకలు సాగించేవారని, వంతెన కొట్టుకుపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలు అనంతరం ఐటీడీఏ పిఒ కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించి పునర్నిర్మాణానికి సత్వర చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని, కాని నేటికీ ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించి వెంటనే చిన్న గంగవరం వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలని, శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.

కూలిపోయిన వంతెన వద్ద నిరసన తెలుపుతున్న చిన్న గంగవరం గ్రామస్తులు

విద్యార్థి మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలో ఏపీఆర్ స్కూల్ పదో తరగతి చదువుతున్న వంతల మనోజ్ తేజ్ మృతికి కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను జీవన్ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి వినతి పత్రం అందజేశారు.మనోజ్ కుటుంబానికి నష్టపరిహారం 30 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చిన్నారావ్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి మరణంపై విచారణ చేపట్టాలి

కొయ్యూరు : కొయ్యూరు మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి మనోజ్ (15) అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించి, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.సూరిబాబు డిమాండ్ చేశారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలలపై సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడంతోనే విద్యార్థులు అదృశ్యం, అనుమానాస్పద మృతులు, అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. వీటికి ఆయా శాఖల అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలలకు వాచ్‌మెన్లు, హెల్త్ వాలంటీర్లను నియమించాలని కోరుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గురుకుల పాఠశాలల టీచర్లు నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని సూరిబాబు డిమాండ్ చేశారు.

యుఇసిడబ్ల్యు యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మోతుగూడెం

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్ 176 (సిఐటియు) మోతుగూడెం బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో మంగళవారం యూనియన్ నాయకులు చింత రాంబాబు, బివి వెంకట రమణ ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులుగా గుబ్బల ప్రేమ్‌సన్, కార్యదర్శిగా వేపకాయల శ్రీను, కోశాధికారిగా దొడ్డి మల్లేష్, ఉపాధ్యక్షులుగా జోసెఫ్, కమిటీ సభ్యులుగా సూరిబాబు, మహేష్, స్వామి, కార్తీక్, సీత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ కార్యదర్శి జె.రత్నం మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కావాలంటే ముందు కార్మికులు ఐక్యత ఉండాలని సూచించారు. నూతన కమిటీని ఆయన అభినందించారు.

ఎన్నికైన కార్యవర్గంలో నాయకులు, కార్మికులు

వాలంటీర్ల రిలే దీక్షలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పెదబయలు : గ్రామ వాలంటీర్ల సమస్యలపై ఈనెల 26, 27, 28 తేదీల్లో మండల కేంద్రంలో జరిగే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని గ్రామ వాలంటీర్ల సంఘం (సిఐటియు) పెదబయలు మండల కమిటీ పిలుపు నిచ్చింది. మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం గ్రామస్థాయిలో వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి నెలకు 5000 రూపాయల చొప్పున గౌరవ వేతనమిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా వీరిని నియమించిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా టిడిపి ప్రభుత్వం అధికారంలో వస్తే వాలంటీర్లకు పదివేల రూపాయలు చెల్లిస్తామని వాగ్దానం చేసిందని, నేటికి ఆరు నెలలు అవుతున్నా ఆ ఊసే ఎత్తలేదన్నారు. టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, బకాయి పడ్డ 7 నెలల వేతనాలు వెంటనే వాలంటీర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆందోళనలో భాగంగా పెదబయలు మండల కేంద్రం కేంద్రంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగే దీక్షలను మండలంలో ఉన్న 250 మంది గ్రామ వాలంటీర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగని ధర్మానపడాల్, వాలంటీర్ల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు జీ.తాతబాబు, లోహిదాసు ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు సిహెచ్ ప్రవీణ్ కుమార్, ఎం కృష్ణారావు(కోశాధికారి), వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సన్నిబాబు

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదబయలు: మండల కేంద్రంలో ప్రజాశక్తి 2025 కేలండర్‌ను స్థానిక ఎస్ఐ కె.రమణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ, నీతి నిజాయితీతో వాస్తవాలను ప్రజాశక్తి దిన పత్రిక వార్తలను ప్రచురిస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి పత్రిక ద్వారా తెలియపరచి పరిష్కరించే దిశగా ముందుకు సాగుతుందన్నారు. 2025 కేలండర్ ఆవిష్కరించడం శుభ పరిణామన్నారు ఈ కార్యక్రమంలో పూర్వ ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు సన్నిబాబు, అధ్యక్షులు ధర్మన్న పడాల్, గిరిజన వర్తకం సంఘం అధ్యక్షులు పి.భాస్కర్ రావు, బబ్జి, సిహెచ్ రామరావు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

మాట్లాడుతున్న గిరిజన మహిళా సంఘం అధ్యక్షురాలు ఈశ్వరి

మహిళలపై హింసను అరికట్టాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల1,2 పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ఆదివాసి గిరిజన మహిళ సంఘం, ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు ఆధ్వర్యంలో మంగళవారం మహిళలపై జరుగుతున్న హింసాకాండను అరికట్టాలని సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గిరిజన మహిళా సంఘం అధ్యక్షులు ఎస్.ఈశ్వరి మాట్లాడుతూ, మహిళ సాధికారత ద్వారానే హింసను అధిగమించగలమన్నారు. బాహ్య ప్రపంచంలో మహిళలపై అనేక విధాలుగా వేధింపులు పెరుగుతున్నాయన్నారు. హత్యాచారాలు, కిడ్నాప్లు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రత్యేక చట్టాలు, హక్కులను ప్రభుత్వం గాలికి వదిలేస్తుందన్నారు.

కార్యదర్శి విజయ కార్యదర్శి మాట్లాడుతూ బాల్య వివాహం చట్టారీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు అవగాహన కల్పించాలన్నారు. విద్యా రంగంలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ 1 పాటు బోయి సత్యనారాయణ, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్, , గిరిజన సంఘం సీనియర్ నాయకులు సొలగం గాసిరందొర, వి.లైకోన్, పి రామదాసు, వ్యాయామ ఉపాధ్యాయురాలు అశోక్ కుమారి పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో సభ్యత్వ నమోదు పై అవగాహన కల్పించారు. దరఖాస్తులు అందజేయడం జరిగిందని రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మంగళవారం పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అభిషేక్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లాలో పలు విద్యాసంస్థలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలియజేశారు.అనంతరం గుత్తుల పుట్టు ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుని కలిసి పాఠశాల సిబ్బందితో మాట్లాడి సభ్యత్వ నమోదుకు సహకరించాలని కోరారు. అంతకుముందు పాడేరు సిఐను కలిసి 27వ తేదీ శుక్రవారం నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, కోశాధికారి పి సూర్యారావు, సభ్యులు టి ప్రసాద్ నాయుడు, జిల్లా కోఆర్డినేటర్ వీ లోహితస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఇస్తున రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

పీసా కమిటీ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థుల గెలుపు

ప్రజాశక్తి-విఆర్.పురం

విఆర్.పురం మండలం రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పీసా కమిటీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికల తలపించేలా జరిగాయి. పీసా కమిటీ ఎన్నికల్లో వైసిపి, సిపిఎం అభ్యర్థులు పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులు సారా పాండురాజు ఉపాధ్యక్షునిగా, వేటగాని సూరిబాబు కార్యదర్శిగా వైసిపి అభ్యర్థులపై విజయం సాధించారు. గ్రామసభకు అధ్యక్షులుగా స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, ఎన్నికల అధికారిగా ఎంఈఓ వివి లక్ష్మీనారాయణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, నాయకులు పంకు సత్తిబాబు, చిన్నమట్టపల్లి ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, శీరపు తాతబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, నాళ్ళరపు ప్రకాష్‌రావు, సీనియర్ నాయకులు పంకు శ్రీరామ్మూర్తి, వీర్ల నాగేశ్వరరావు, నాల్లరపు చింటు, బీరబోయిన గౌతమ్, కల్లి రవి, బాబీ, వివిధ పార్టీల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సర్పంచ్ సరోజిని, ఎంఇఒ లక్ష్మీనారాయణ తదితరులు

అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

అనిగేరులో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల పంచాయితీ పరిధి అనిగేరు గ్రామంలో తహశీల్దారు సూర్యారావు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు తమ భూమికి సంబంధించిన సమస్యలపై తహశీల్దారుకు దరఖాస్తులు అందజేశారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తహశీల్దారు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాజేశ్వరి, సర్వేయర్లు వి.మనోహర్, జ్యోతి, గణేష్ సచివాలయం సిబ్బంది డిఎ.సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ముర అబ్బాయి రెడ్డి, బాల్ రెడ్డి, బాపనమ్మ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దేవీపట్నం : తేలికపాటి నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యసాయ అధికారి ఆర్.ప్రశాంతి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వరి కోతలను రెండ మూడు రోజులు వాయిదా వేసుకోవాలని, కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచిపోకుండా జాగ్రత్తలు తీసుకుని టార్పలిన్లు కప్పి ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడైనా ధాన్యం తడిస్తే మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని విక్రయించడానికి గ్రామ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు.

కోరం లేక పీసా గ్రామసభ వాయిదా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి సచివాలయం వద్ద మంగళవారం జరగవలసిన పీసా గ్రామసభ కోరం సరిపోకపోవడంతో వాయిదా వేశారు. రాజువొమ్మంగి సూరంపాలెం గ్రామాలకు సంబంధించి 5,704 మంది ఓటర్లు ఉండగా, అందులో 1900 మంది (35శాతం) ఓటర్లు గ్రామసభకు హాజరు కావాల్సి ఉంది. ఈ కోరంకు సరిపడా ఓటర్లు రాకపోవడంతో సర్పంచ్ గొల్లపూడి రమణి గ్రామసభను వాయిదా వేశారు. పీసా గ్రామసభను ఆవశ్యకతను గ్రామస్తులకు వివరించారు.

ఎన్నికైన వారికి సన్మానం

మండలంలోని రాజవొమ్మంగి పంచాయతీ పరిధిలోని అప్పలరాజుపేట, బొరుగుపల్లి, వయ్యాడు, మురళివానిపాలెం గ్రామాల్లో ఇటీవల జరిగిన పీసా గ్రామసభ ఎన్నికల్లో ఎన్నుకోబడిన ఉపాధ్యక్షులు, కార్యదర్శులను స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పీసా డే సందర్భంగా మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఏవో చక్రవర్తి, సచివాలయ సిబ్బంది, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ రమణి

రుణాలు మంజూరు చేయాలి

బ్యాంకర్లతో సమావేశంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో ఉన్నత విద్య అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకునే విధంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో డిసిసి చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా రుణాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించి అవసరమైన వారికీ విద్యా రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఆర్థిక అక్షరాస్యత, సైబర్ క్రైమ్‌పై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కొత్తగా పంట రుణాలు మంజూరు చేయాలనీ తెలిపారు. వ్యవసాయ అనుసంధానమైన సంస్థలకు రుణాలు మంజూరు చేయాలనీ తెలిపారు. పేదల జీవన ప్రమాణాల మెరుగుకు బ్యాంకులు సహకారం అందించాలని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులకు, కొత్త రైతులను గుర్తించి బ్యాంకులు రుణాలు అందించడానికి ముందుకు రావాలని బ్యాంకర్లను కోరారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల రుణాలపై రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, అంతర్ పంటలకు రెండు రుణాలు ఇచ్చే అవకాశాన్ని వారికి తెలియజేయాలని సూచిస్తూ, వరితో పాటు కాఫీ, మిరియాలకు కూడా రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పశుక్రాంతి పథకం కింద, పాలు ఇచ్చే పశువులు, పిగ్గరి, చేపల బోటులకు రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎం పథకాల కింద రుణాలు మంజూరు చేయాలన్నారు. మహిళలను లక్షాదికారులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లక్ పతి దీది పథకం కింద రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, ఎల్డిఎం మాతునాయుడు, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పి.నరేష్, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ టి.కిషోర్ కుమార్, ఎపిజివిబి చీఫ్ మేనేజర్, ఆర్ బి ఐ లీడ్ జిల్లా అధికారి సిహెచ్ నవీన్ కుమార్, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు ఎస్బిఎస్ నంద్, పి.రమేష్ కుమార్‌రావు, నరసింహారావు, అప్పారావు, పరిశ్రమల అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.వి. రమణారావు, డిఆర్‌డిఎ పిడి వి.మురళి, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పీసా దినోత్సవం

ప్రజాశక్తి- చింతపల్లి: గ్రామ సభల ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించేందుకు పిసా చట్టం దోహద పడుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని కందులగేది గ్రామంలో నిర్వహించిన పీసా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ దురియ పుష్పలత, జడ్పిటిసి పోతురాజు బాలయ్య లు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ సభల ద్వారా గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనంద్, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం పాల్గొన్నారు.

చింతపల్లి: పీసా కమిటీ పరిధిలోని గ్రామాల్లో ఉంటున్న ప్రజల భాగస్వామ్యం లేకుండా అవగాహన సదస్సులా అని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా తాజంగి పంచాయితీ సచివాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో హాజరైన ధనుంజయ్ మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం గిరిజన చట్టాల కోసం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం పిసా గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ సభలకు అధికారాలను అమలు చేయాలన్నారు. ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లను, సచివాలయ ఉద్యోగస్తులతో సదస్సు జరిపి చేతులు దులుపు కుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వాంద్రబు లక్ష్మయ్య, కిల్లో పురుషోత్తం, లక్ష్మణరావు, రాజేష్ పాల్గొన్నారు

అధికారులతో సమీక్ష

అరకులోయ రూరల్: పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు పీసా కమిటి ఎన్నికలపై పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ ఎల్ లవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లవరాజు మాట్లాడుతూ, అరకులోయ మండలంలోని 14 పంచాయతీ పరిధిలోని ఉన్న 56 పేసా, గ్రామ సభలకు జనవరి 3,4 తేదీలలో వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శిల ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. 15 మంది గెజిటెడ్ అధికారులను ఎలక్షన్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు.

దుంబ్రిగుడ: కండ్రుమ్ పంచాయతీలో సర్పంచ్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కిముడు హరి ఆధ్వర్యంలో పెషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.చట్టాలు వల్ల కలిగే ప్రయోజనాల పై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంద్, ఉప సర్పంచ్ ప్రతిమ, పంచాయతీ కార్యదర్శి లెక్కల వాణి, మాజీ సర్పంచ్ ఆనందరావు, వార్డు సభ్యులు జన్ని బలరామ్, ముద్దుల కృష్ణ, పాంగి శత్రుగున్ పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు : లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొర్రా.త్రినాథ్ అధ్యక్షత పీసా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అర్లాబు సత్యం, వార్డు సభ్యులు హరి, సొద, బలరాం, మాజీ ఉప సర్పంచ్ వి.ధనుర్జయ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: టోకురు, అనంతగిరి పంచాయతీలో సర్పంచ్‌లు కిల్లో. మొస్య, ఎస్.రూతులు పీసా చట్టంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొన్ను, వార్డు సభ్యులు రామ్మూర్తి, ప్రసాద్, పీసా ఉపాధ్యక్షులు గెమ్మెల. దేవన్న, సమర్థి రామస్వామి, గెమ్మెల రాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ త్రినాథ్ పాల్గొన్నారు

హుకుంపేట: మండలంలోని పలుచోట్ల పీసా దినోత్సవాలు జరిగాయని ఇఒపిఆర్‌డి ఎం అప్పలరాజు తెలిపారు. కొంతిలిలో పీసా గ్రామసభలో సర్పంచ్ రమేష్ మాట్లాడారు.

చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

అనంతగిరిలో మాట్లాడుతున్న సర్పంచ్ మొస్య

హుకుంపేటలో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి అప్పలరాజు

సీలేరులో మాట్లాడుతున్న ఎంపిపి కుమారి

సీలేరు : గిరిజనులకు పీసా చట్టం ద్వారా సంక్రమించే హక్కులు సద్వినియోగం చేసుకోవాలని జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి స్థానిక సర్పంచ్ పాంగి దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం సీలేరు పంచాయితీలో పీసా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక ఆర్థిక అభివృద్ధి కొరకు ప్రణాళికలను పీసా కమిటీ ద్వారా ఆమోదించాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కే.వల్లి ప్రసాద్, పంచాయతీ గుమస్తా ప్రకాష్, సచివాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు శ్రీను అప్పారావు, కూటమి నాయకులు బాలు, వనముల రాము, చిటికెల రాము, అంగన్వాడి టీచర్ రుక్మిణి పాల్గొన్నారు.

3 నుండి పీసా కమిటీ ఎన్నికలు

అరకులోయ : మండలంలోని 14 పంచాయతీల పరిధిలో 56 పెసా గ్రామ సభలకు వచ్చేనెల 3 వ తేదీ నుండి రెండు రోజులపాటు పెసా ఎన్నికలు జరగనున్నట్లు స్థానిక ఎంపీడీవో కె. లవరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పెసా గ్రామసభల ఎన్నికలకు సంబంధించి పంచాయితీ కార్యదర్శులతో ప్రత్యేక రివ్యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ పిఓ ఆదేశాల మేరకు అరకులోయ మండలంలో వచ్చేనెల 3, 4 తేదీల్లో 56 పీసా గ్రామసభలు నిర్వహించి పెసా కమిటీ ఎన్నుకోవడం జరుగుతుందన్నారు . ఎన్నికలలో వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శులను ఎన్నుకుంటారని తెలియజేశారు. ఈ ఎన్నికలకు మండలంలోని గెజిటెడ్ అధికారులను నియమించడం జరుగుతుందన్నారు.

జాకీర్ హుస్సేన్‌కు ఘననివాళి

నివాళులర్పిస్తున్న సేవా కళా పీఠం సభ్యులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రముఖ తబలా కళాకారుడు జాకీర్ హుస్సేన్‌కు గోపాలపట్నం కళాశాల పీఠం నివాళు లర్పించింది. ఈ సందర్భంగా కళ్యాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ తబలా విద్వాంసుడిగా ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించి, భారతదేశ సాంస్కృతిక ఔన్నత్యాన్ని జాకిర్ హుస్సేన్ ఇనుమడింపజేశారనికొనియాడారు. పద్మవిభూషణ్ అవార్డు పొందిన ఏకైక తబలా విద్వాంసుడిగా, ప్రపంచ ప్రఖ్యాత గ్రేమీ అవార్డ్సుకు ఏడుసార్లు నామినేట్ అయ్యి, నాలుగు సార్లు గెలుచుకొని జన్మభూమికి వన్నెతెచ్చిన మహావ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు . అధ్యక్షుడు బంగారు రాజు, గౌరవాధ్యక్షులు చందు సుబ్బారావు, గౌరవ సలహాదారులు తాండ్రంగి రామారావు, మిద్ది అప్పారావు, మాజీ అధ్యక్షులు గొరకల రామదాసు, లైబ్రేరియన్ నరసింహం, టి.రామచంద్రరావు, యల్లపు రమణారావు, భాస్కర్ పాణిగ్రాహి, అల్లు నారాయణరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుల్లో యువతే అధికం

గీతంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సులో నిపుణులు

గీతం సదస్సులో మాట్లాడుతున్న నిపుణుడు

ప్రజాశక్తి- మధురవాడ : మితిమీరిన వేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు. దేశంలో ఏటా 4.5 లక్షల రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో అధిక శాతం 18-25 ఏళ్ల యువకులేనన్నారు. మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సులో కెజిహెచ్ ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజూరీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.అనిల్‌కుమార్, మెడికవర్ ఆసుపత్రి క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ మోహన్ మహారాజ్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాల ప్రభావం బాధిత కుటుంబాలతోపాటు సమాజంపై పడుతోందన్నారు. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ అధ్యయనం ప్రకారం బైక్‌లపై వాహన చోదకుడితో పాటు వెనకనున్న వారు హెల్మెట్ ధరించక పోవడం వల్ల 40 శాతం మంది తీవ్ర గాయాలపాలై కోలుకోలేకపోతున్నారన్నారు. ప్రమాదం జరిగిన తరువాత అత్యవసరం అనుకుంటే తప్ప బాధితులను అంబులెన్స్ వచ్చే వరకు కదప కూడదన్నారు. వెన్నెముక జాగ్రత్తగా ఉండేలా చూడాలని, బాధితులు కంగారుపడకుండా ధైర్యం చెప్పాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధితులను పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పకుండా తక్షణమే సమీప ఆసుపత్రుల్లో చేర్చి వైద్యం అందించేందుకు ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం చట్టం చేసిందన్నారు..

గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ వాహనదారులు చట్టాలను, ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి, బాధ్యతతో వ్యవహరించాలన్నారు. గీతం ప్రాంగణంలో అందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా నిబంధన అమలు చేస్తున్నామన్నారు.. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, సెక్యూరిటీ డైరెక్టర్ బిక్రమ్ పట్నాయక్, సెక్యూరిటీ హెడ్ రామాజనాయులు, వివిధ విభాగాల ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తర్లువాడలో లేగ దూడల ప్రదర్శన

బహుమతులు ఇస్తున్న వెటర్నరీ జెడి రామకృష్ణ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని తర్లువాడ గ్రామంలో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సౌజన్యంతో, రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడలు ప్రదర్శన నిర్వహించారు ఈసందర్భంగా వెటర్నరీ జెడి డాక్టర్ డి. రామకృష్ణ మాట్లాడుతూ కృత్రిమగర్భధారణ ఇంజిక్షన్లను 60 శాతం రాయితీతో అందిస్తున్నామని, పాడిరైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి నిధులతో బహువార్షిక పశుగ్రాసం పెంపకానికి శతశాతం రాయితీ ఉందన్నారు. ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక మాట్లాడుతూ దూడలను శాస్త్రీయ యజమాన్యంతో పెంచితేపాడిరైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు ప్రదర్శనలో 42 లేగదూడలు రాగా, ఉత్తమమైన వాటితోపాటు అందరు రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, వెటర్నరీ ఎడి డాక్టర్.సజ్జ శ్రీనివాసరావు, డాక్టర్ మదీనా ప్రసాద్, డిఎల్‌డి పశు వైద్యాధికారి డాక్టర్. సౌజన్య , ఆనందపురం డాక్టర్ పి అనిల్‌కుమార్ టిడిపి నేతలు అప్పారావు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు,పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

మొక్కలతో పర్యావరణానికి మేలు

ప్రజాశక్తి - సీలేరు : మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికి ఎంతో దోహదపడుతుందని సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి శంకర్రావు అన్నారు. జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించి, పచ్చని చెట్లు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకర్రావు మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. పచ్చని చెట్లు పెంచితే కాలుష్య నివారణతో పాటు మానవాళికి అవసరమైన ఆక్సిజన్ అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక ఐక్యతతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి-సీలేరు : కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యత హక్కులు సాధించుకోవడానికి దోహదపడుతుందని సిఐటియు బ్రాంచ్ గౌరవ అధ్యక్షులు ఎస్కే.సుభాన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సీలేరు అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణరావు, విష్ణు కుమార్ పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ జెన్కో యాజమాన్యం హరిస్తుందని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులు సమస్యల పరిష్కారానికి యూనియన్ రాష్ట్ర నాయకత్వం అటు రాష్ట్ర ప్రభుత్వంపైనా, ఇటు ఏపీ జెన్కో యాజమాన్యంపైనా ఒత్తిడి తెస్తూ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్‌కోలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని అనేకసార్లు యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించిన స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి కాంట్రాక్టర్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రతి రోజూ సేవా కార్యక్రమం చేపట్టండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మ సంతృప్తితో ఆనందమయ జీవనం గడపాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పిలుపునిచ్చారు. ప్రతి రోజూ ఓ సేవా కార్యక్రమం చేపట్టాలని ఆకాంక్షించారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకులను నిర్వహించారు. వీటికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో విమ్స్ డెరెక్టర్ డాక్టర్ కె,రాంబాబు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బికె.రామేశ్వరి స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ నిర్వాహకులు ఆర్.నాగరాజు పట్నాయక్ పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను అతిథులు కట్ చేశారు. నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు.

విద్యుత్ మోతపై 27న వైసిపి పోరుబాట

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న వైసిపి ఆధ్వర్యాన చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆశీలుమెట్టలోని తన కార్యాలయంలో మంగళవారం దక్షిణ వైసిపి శ్రేణులు, కార్యకర్తలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఫార్మాలో భయం.. భయం

ప్రమాద హెచ్చరిక పరికరాల ఏర్పాటుపై నిర్లక్ష్యం
రక్షిత్‌లో లేని డిటెక్టర్లు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగ రాజారావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జెఎన్‌పిసి)లో చోటుచేసుకుంటున్న వరుస ప్రమాదాలు కార్మికులకు భయాందోళన కలిగిస్తున్నాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం అందరిలో నెలకొంది. రక్షిత్ ఫార్మాలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఇద్దరి కార్మికుల అస్వస్థతకు యాజమాన్య తప్పిదమే కారణంగా కనిపిస్తోంది. హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు విడుదల కావడంతో అస్వస్థతకు గురైన ఆ ఇద్దరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ఇతర ఫార్మా పరిశ్రమల ప్రమాదాల్లో బయటపడ్డ యాజమాన్య నిర్లక్ష్యవే రక్షిత్ ఫార్మాలోనూ కనిపించింది. ఫార్మా పరిశ్రమల్లో ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా, కార్మికుల ప్రాణాలు పోతున్నా, ఆస్పత్రుల పాలవుతున్నా పరిశ్రమాధిపతుల మనసు కరగడంలేదు. భద్రతా ప్రమాణాలు పాటించాలన్న ఆలోచన రావడంలేదు. 2020 జూన్ 29న సైనార్ లైఫ్ సైన్సెస్‌లో హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు లీకై ఇద్దరు కార్మికులు మృతిచెందగా, ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. రక్షిత్ ఫార్మాలో న్యూట్రలైజ్ చేసే జాయింట్ దగ్గర వాయువు లీకైవుంటుందని విచారణాధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వాస్తవానికి ఈ ప్రమాదం అతి సులువుగా నివారించదగినదే అయినప్పటికీ ఆ నివారణ చర్యలను యాజమాన్యం చేపట్టలేదు. వాయువులను గుర్తించి హెచ్చరించే ఫిక్స్‌డ్ డిటెక్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో కార్మికులు ఈ ప్రమాదానికి గురయ్యారు.

హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు వాసన సులభంగా గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సగటున గాలిలో 0.03-0.05 పిపిఎం స్థాయిలో ప్రతి ఒక్కరు వాసన పసిగట్టగలరు. కొందరికి 0.0008 పిపిఎంల స్థాయిలో కూడా వాసన తెలుస్తుంది. గరిష్టంగా 100 పిపిఎంల వరకు వాసన గుర్తించగలరు. ఆ పైన వచ్చే వాసన తెలియక ప్రమాదాలు జరుగుతాయి. పనిలో గరిష్టంగా 15 నిమిషాల పాటు 15 పిపిఎంల హైడ్రోజన్ సల్ఫైడ్‌వున్న గాలి పీల్చినా ప్రమాదంవుండదు. ఆపైన పీల్చితే ప్రమాదం కానుంది. హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు విడుదలయ్యే పని ప్రదేశాలలో ఆ వాయువును గుర్తించే డిటెక్టర్లు ఏర్పాటు చేయాలి. 10 పిపిఎంలకు వాయువులు చేరగానే హెచ్చరించేలా పని ప్రదేశాల్లో ఆ డిటెక్టర్లను ఏర్పాటు చేయాల్సివుంది. కానీ ఇక్కడ యాజమాన్యం డిటెక్టర్లు ఏర్పాటు చేయలేదు.

తనిఖీల నిమిత్తం మాన్యువల్ (పోర్టబుల్) డిటెక్టర్లను వినియోగిస్తున్నారు తప్పితే ప్రమాద హెచ్చరికలు చేసే ఫిక్స్‌డ్ డిటెక్టర్లు ఏర్పాటు చేయలేదు. రియాక్టర్ల నుంచి వాయువులు విడుదలైవుంటే ప్రమాద తీవ్రత పెరిగివుండేది. రక్షిత్ ఫార్మాను ఏడాది క్రితం ఫ్యాక్టరీస్ అధికారులు తనిఖీ చేసినప్పుడు స్క్రబ్బర్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. వాటిని ఏర్పాటు చేసినా నిరంతరం అంతర్గత పర్యవేక్షణ చేస్తుండాలి. ఇది లోపించడంతో లీకేజీ జరగడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డిటెక్టర్లు ఏర్పాటువుంటే వాయువు లీకైనా ప్రమాద హెచ్చరికలతో కార్మికులు ప్రమాదం నుంచి తప్పించుకొనే వీలుంటుందని 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' ప్రతినిధి డాక్టర్ కె.బాబూరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఇది ఖరీదైన పరికరం కానప్పటికీ యాజమాన్యం ఏర్పాటు చేయలేదు.

చండీగఢ్ విద్యుత్ కార్మికులకు సంఘీభావం

డిస్కంల ప్రైవేటీకరణ ఆపాలి : సిఐటియు

చండీగఢ్ విద్యుత్ కార్మికుల పోరాటానికి విశాఖ కార్మికులు మద్దతు తెలిపారు. సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర బిజెపి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలను వేగవంతం చేసిందని, చండీగఢ్‌లోని విద్యుత్ డిస్కంలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి పూనుకుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చండీగఢ్‌లో విద్యుత్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ పార్క్ హోటల్ వద్దనున్న ఎలక్ట్రిసిటీ ఎస్ఇ కార్యాలయం ఎదుట ఆయన నేతృత్వాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చండీఘర్ రాష్ట్ర డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను కార్పొరేట్ సంస్థ అయిన ఎమినేంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీకి అమ్మడానికి ఈ నెల 4న చండీగఢ్ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్ అని, లాభాలు గడించే చండీగఢ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేటు వారికి అప్పజెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. మన రాష్ట్రంలో కూడా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే విద్యుత్తును ప్రైవేటీకరణ చేసేందుకు రంగం సిద్ధమవుతోందన్నారు. అందులో భాగంగానే ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై మోయలేని భారాలను మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు పి.మణి, ఎం.సుబ్బారావు, నాయకులు యుఎస్ఎన్.రాజు, పి.వెంకటరావు, జి.అప్పలరాజు, జి.పోలేశ్వరరావు, కె.కుమారి, అనపర్తి అప్పారావు, ఎం.చంటి పాల్గొన్నారు.

గాజువాక : చండీగఢ్‌లో విద్యుత్ డిస్కంల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చినగంట్యాడ సబ్‌స్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు ఎం.రాంబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అన్ని విద్యుత్ సంస్థలను ప్రయివేటుపరం చేయాలని చూస్తోందని, దానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి కుమారి

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ కాలనీకి సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ బోయిన కుమారి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. వలసగెడ్డ కాలనీలో సీసీ రోడ్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, వర్షాకాలంలో వీధుల్లో వర్షపు నీరు చేరి నాన అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. సిసి రోడ్డు పనులు పూర్తయితే కాలనీ ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి కేలేబు కుమారి, ఉప సర్పంచ్ మంగరాజు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని సరివెల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మొర్రం రాజయ్య కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున రూ.5వేలు ఆర్థిక సాయం మంగళవారం ట్రస్టు సభ్యులు అందజేశారు. కుటుంబ పెద్ద మృతి చెందడం వల్ల ఆ కుటుంబం ఎన్నో ఇబ్బందులకు గురవుతుందని, అటువంటి కుటుంబానికి ఆసరాగా జమాల్ ఖాన్ ఈ సహాయం అందించినట్లు ట్రస్టు సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్కే రియాజ్, గ్రామ పెద్దలు ముత్యాల శ్రీరామ్, పొదిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ మహిళా సెక్యూరిటీ గార్డులను అసభ్య పదజాలంతో దూషించిన కెజిహెచ్ సెక్యూరిటీ గార్డ్స్ సూపర్‌వైజర్ దుర్గాప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని అడిగిన మహిళా సెక్యూరిటీ గార్డుల పట్ల దురుసుగా, అసభ్యంగా దుర్గాప్రసాద్ వ్యవహరించారన్నారు. ధర్నా అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందను కలిసి పరిస్థితిని వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. బకాయి వేతనాలు చెల్లించే విధంగా పై అధికారులతో మాట్లాడతానని చెప్పారు. ధర్నాలో సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, పి.మణి తదితరులు పాల్గొన్నారు

విశాఖ నగరంలో క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని దాదాపు అన్ని చర్చిలు బుధవారం క్రిస్మస్ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి సిద్ధమైపోయాయి. ఇప్పటికే రంగురంగుల విద్యుత్ దీపాలతో చర్చిలను అలంకరించడంతో కాంతులీనుతున్నాయి. ఓల్డ్ టౌన్‌లో అనేక చారిత్రక ప్రసిద్ధ చర్చిలు ఉన్నాయి. 200 ఏళ్ళ చరిత్ర కలిగిన చర్చిలు రెండు ఉన్నాయి. ప్రధానంగా రోజ్ హిల్స్ చర్చితోపాటు జగదాంబ జంక్షన్‌లోని సెయింట్ పాల్స్ చర్చి, ట్రినిటీ లూథరన్ చర్చి, అల్లిపురంలోని కల్వరి బాప్టిస్ట్ చర్చి, సిరిపురం వాల్తేర్ క్లబ్‌ను అనుకొని ఉన్న సెయింట్ పాల్స్ పురాతన చర్చి విద్యుత్ దీపాల వెలుగులో సుందరంగా కనిపిస్తున్నాయి. క్రిస్మస్ వేడుకలకు అన్ని హంగులతో అవి సిద్ధమయ్యాయి. మరోవైపు క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. నగరంలో క్రిస్మస్‌కు సంబంధించిన స్టార్స్, విద్యుత్ లైట్లు, క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ డ్రెస్సెస్, టోపీలు, ఇలా ఎన్నో రకాల డెకరేటివ్ పరికరాల కొనుగోళ్ల ఊపందుకున్నాయి.